లక్షద్వీప్‌పై మాల్దీవుల అక్కసు

- భారత్, ప్రధానిపై ఆ దేశ మంత్రుల దుర్భాషలు
- సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు, నెటిజన్ల ఆగ్రహం
- మాల్దీవులను బాయ్‌కాట్ చేయాలని పిలుపు
- దిద్దుబాటు చర్యలు చేపట్టిన మాల్దీవులు ప్రభుత్వం
- ముగ్గురు డిప్యూటీ మంత్రులపై సస్పెన్షన్ వేటు

ముంబై, జనవరి 7: భారత్‌పైనా, ప్రధాన మంత్రి నరేంద్రమోదీపైనా మాల్దీవుల మంత్రులు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు రాజేశాయి. ఇటీవల ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటనను ఉద్దేశిస్తూ మాల్దీవుల మంత్రులు సామాజిక మాధ్యమాల్లో చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై భారత్ తీవ్రంగా మండిపడింది. బాలీవుడ్ నటులు, రాజకీయ, క్రీడా ప్రముఖులు, నెటిజనులు కూడా సోషల్‌మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాల్దీవులను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. మాల్దీవుల ప్రతిపక్షాలు కూడా ఆ దేశ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. దీంతో మాల్దీవుల ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముగ్గురు డిప్యూటీ మంత్రులపై సస్పెన్షన్ వేటు వేసింది.

అసలేం జరిగింది?

ప్రధాని మోదీ ఇటీవల లక్షద్వీప్‌లో పర్యటించారు. అక్కడి సముద్రంలో స్నార్కెలింగ్ చేశారు. సాహసాలు చేయాలనుకునేవారు.. తమ లిస్టులో లక్షద్వీప్‌ను చేర్చుకోవాలని సూచిస్తూ ఫొటోలను షేర్ చేశారు. ఈ పోస్ట్‌పై మాల్దీవుల మంత్రులు అభ్యంతర వ్యాఖ్యలు చేశారు. ప్రధానిని ఇజ్రాయెల్ పప్పెట్‌గా అభివర్ణిస్తూ ఓ మంత్రి దుర్భాషలు చేశారు. భారత్‌ను ఆవు పేడతో పోల్చారు. మరో ఇద్దరు మంత్రులు కూడా ఇదే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై దుమారం రేగింది.

భారతీయులు లక్షద్వీప్‌కే వెళ్లాలి..

మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు, నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై భారతీయులు లక్షద్వీప్‌కే వెళ్లాలని, పర్యాటకంగా మాల్దీవులని బాయ్‌కాట్ చేయాలని కోరారు. భారత్‌లోని తీరప్రాంతాలు, దీవుల్లోని అందమైన బీచ్‌లకు సందర్శించండి.. అంటూ తమ అభిమానులను బాలీవుడ్ సినీ నటులు సల్మాన్‌ఖాన్, అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్, శ్రద్ధా కపూర్, క్రికెటర్ హార్దిక్ పాండ్యా, వెటరన్ క్రీడాకారుడు వెంకటేశ్ ప్రసాద్ కోరారు. తన 50వ పుట్టినరోజును కొంకణ్ తీరంలో జరుపుకున్నానని సచిన్ టెండుల్కర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

మాకే సంబంధం లేదు : మాల్దీవుల ప్రభుత్వం

మాయిజ్జు ప్రభుత్వ తీరుపై మాల్దీవులు ప్రతిపక్ష పార్టీ నాయకులు మండిపడ్డారు. భారత్‌పై విద్వేష వ్యాఖ్యలు చేయటాన్ని ఆ దేశ మాజీ అధ్యక్షులు ఇబ్రహీం సోలీ, మహ్మద్ నషీద్‌లు ఖండించారు. ఇరు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. దీంతో ఆదివారం మాల్దీవుల ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను చేపట్టింది. భారత్, ప్రధాని మోదీపై తమ మంత్రులు, అధికారులు చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నది. సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులు మాల్షా షరీఫ్, మరియం షువానా, అబ్దుల్లా మాజిద్, ప్రభుత్వ అధికారుల్ని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది.

మరియం షువానా, అబ్దుల్లా మాజిద్, మాల్షా షరీఫ్

చైనాకు దగ్గరవుతున్న మాల్దీవులు!

మహ్మద్ మాయిజ్జు

చైనాతో స్నేహం కోరుకుంటున్న మహ్మద్ మాయిజ్జు మాల్దీవులు అధ్యక్షుడయ్యాక భారత్–మాల్దీవులు సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత్‌తో చేసుకున్న రక్షణ సహా పలు ఒప్పందాల్ని రద్దు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. మాల్దీవుల్లోని భారత సైనిక బలగాల్ని ఉపసంహరించుకునేందుకు చర్యలు చేపట్టారు. భారత్‌కు వ్యతిరేకంగా.. చైనాకు దగ్గరయ్యేందుకు పావులు కదుపుతున్నారు. అధ్యక్షుడు మాయిజ్జు తొలి విదేశీ పర్యటన సోమవారం చైనాలో మొదలుకానున్నది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను కలుసుకోబోతున్నారు. ఇదే సమయంలో భారత్ పట్ల మాల్దీవులు మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పర్యాటకంగా ఎంతో ఆదాయాన్ని సమకూర్చుతున్న భారత్‌పై మాల్దీవులు మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు భారతీయుల్ని ఆగ్రహానికి గురిచేశాయి.



రాత్రివేళ కార్గిల్‌లో యుద్ధ విమానం ల్యాండింగ్

వాయుసేన ఘనత

న్యూఢిల్లీ, జనవరి 7: కార్గిల్ పర్వతాల్లో అత్యంత ఎత్తయిన ప్రదేశాల్లో ఓ యుద్ధ విమానాన్ని దింపటమంటే మామూలు విషయం కాదు. మొదటిసారి రాత్రి సమయంలో సి–130జే విమానాన్ని కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్‌పై (తాత్కాలిక రన్ వే) విజయవంతంగా ల్యాండింగ్ చేశామని భారత వాయుసేన ఆదివారం అధికారికంగా వెల్లడించింది. సరిహద్దులో పాక్ నియంత్రణ రేఖకు సమీపంలో అత్యంత ఎత్తయిన ప్రదేశంలో ఈ విన్యాసం నిర్వహించామని తెలిపింది. టెరైన్ మాస్కింగ్ ఉపయోగించి, గరుడ కమాండోల శిక్షణలో భాగంగా ఈ ఆపరేషన్ జరిపామని 'ఎక్స్'లో భారత వాయుసేన ప్రకటించింది. కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్ సముద్రమట్టానికి 10,500 అడుగుల ఎత్తులో ఉంది. సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంబడి పలు వైమానిక కేంద్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై రక్షణశాఖ దృష్టి సారించింది. సైనిక బలగాలు, యంత్రాలు, పరికరాలు.. ఇతర సామగ్రిని తరలించేందుకు ఈ కేంద్రాలు అత్యంత కీలకంగా మారుతాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్కడికి చేరుకునేలా యుద్ధ విమానాల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక ఆపరేషన్‌లు వాయుసేన చేపట్టింది.

439 కోట్ల ఎగవేత

బీజేపీ ఎమ్మెల్యేపై చీటింగ్ కేసు

బెంగళూరు: కర్ణాటకలోని గోకక్ నియోజకవర్గ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళిపై చీటింగ్ కేసు నమోదైంది. బ్యాంకుకు రూ.439 కోట్లు చెల్లించకుండా ఎగవేసిందకు జార్కిహోళితో పాటు మరికొందరిపై వీవీ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. కర్ణాటక స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ (బ్యాంకింగ్) రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. బెళగావి జిల్లాలోని గోకక్‌లో ఉన్న సౌభాగ్య లక్ష్మి సుగర్స్ లిమిటెడ్ వైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గతంలో జార్కిహోళి వ్యవహరించారని ఈ ఫిర్యాదులో తెలిపారు. 2013–2017 మధ్య కాలంలో రూ.232.88 కోట్ల రుణం తీసుకుని, తిరిగి చెల్లించలేదని ఆరోపించారు. 2023 ఆగస్టు 31 నాటికి వడ్డీతో సహా రూ.439.07 కోట్లు చెల్లించవలసి ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ఫ్యాక్టరీ సీఎండీ, డైరెక్టర్లను మార్చారని పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తులో ఉంది.

భూటాన్‌లో చైనా దురాక్రమణ

రాజకుటుంబానికి చెందిన భూమి కబ్జా

న్యూఢిల్లీ, జనవరి 7: భూటాన్ రాజకుటుంబానికి చెందిన పూర్వీకుల ప్రాంతంలో చైనా అతిపెద్ద భూ ఆక్రమణకు పాల్పడుతున్నది. సాంస్కృతిక ప్రాముఖ్యం కలిగిన బేయుల్ కెన్‌నాజోంగ్ నదీ లోయలో టౌన్‌షిప్‌ల నిర్మాణం చకచకా సాగిస్తున్నది. ఒక పక్క సరిహద్దు సమస్యలపై భూటాన్‌తో చర్చలు జరుపుతున్న క్రమంలో డ్రాగన్ దేశం ఈ భారీ దురాక్రమణను కొనసాగిస్తున్నది. నెల రోజుల క్రితం ఉపగ్రహం తీసిన చిత్రాలు వెలుగు చూడటంతో మరోసారి చైనా కుటిల బుద్ధి బయటపడింది. 2020 నవంబర్ 9న తీసిన చిత్రంలో అక్కడ ఎలాంటి కట్టడాల నిర్మాణం ప్రారంభం కాలేదు. కానీ గత ఏడాది డిసెంబర్ 21న తీసిన చిత్రాలలో అక్కడో టౌన్‌షిప్ దర్శనమిస్తున్నది. ఒక పక్క భూటాన్ సరిహద్దుకు సంబంధించి చర్చలు జరుపుతుండగానే జాకర్‌లంగ్ రీజియన్ ప్రాంతంలో బీజింగ్ టౌన్‌షిప్ నిర్మాణాలను కొనసాగించడం చూస్తే ఈ ప్రాంతం నుంచి వైదొలగే ఆలోచనే డ్రాగన్ దేశానికి లేదన్నది స్పష్టమవుతున్నది.

ప్రపంచ కుబేరుడైనా డ్రగ్స్‌కు బానిసే!

- మాదకద్రవ్యాల వ్యసనాన్ని మానుకోని మస్క్

ఆస్టిన్ (అమెరికా), జనవరి 7: మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు కెటామైన్ లాంటి సైకెడెలిక్ డ్రగ్స్‌ను వినియోగిస్తూ గత ఏడాది వార్తలకెక్కిన ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ కంపెనీల అధిపతి ఎలాన్ మస్క్ ఇప్పటికీ మాదకద్రవ్యాల వ్యసనాన్ని మానలేదని తెలుస్తున్నది. దీని వల్ల మస్క్ ఆరోగ్యంతో పాటు ఆయన వ్యాపార సామ్రాజ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతున్నదని ఆ సంస్థల డైరెక్టర్ల బోర్డు సభ్యులు ఆందోళన చెందుతున్నట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రిక వెల్లడించింది. కెటామైన్ లాంటి సైకెడెలిక్ డ్రగ్‌ను వాడేందుకు ప్రిస్క్రిప్షన్‌ను కలిగి ఉన్నట్టు స్వయంగా చెప్తున్న ఎలాన్ మస్క్ గతంలో బహిరంగంగానే మారిజువానాను సేవించిన ఉదంతాలున్నాయి. 2017లో ఓ ఈవెంట్‌కు ఆలస్యంగా వచ్చిన మస్క్.. మాదకద్రవ్యాల మత్తులో బూతులు మాట్లాడారు. అనంతరం పలు సందర్భాల్లో కూడా మస్క్ డ్రగ్స్ తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే వీటిని మస్క్ అటార్నీ అలెక్స్ స్పైరో తోసిపుచ్చారు. మస్క్‌కు తరచుగా డ్రగ్ పరీక్షలు జరుగుతున్నాయని, ఆ టెస్టుల్లో ఆయన ఎప్పుడూ విఫలమవ లేదని స్పైరో చెప్పారు.

80 ఏండ్లు దాటినా రిటైరవ్వరేం?

- శరద్ పవార్‌పై అజిత్ పవార్ విమర్శలు

ముంబై, జనవరి 7: ఎన్సీపీ వ్యవస్థాపకుడు, తన పెద్దనాన్న శరద్ పవార్‌పై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. పవార్ వయసు గురించి ప్రస్తావిస్తూ కొందరు వ్యక్తులు 80వ పడిలో ఉన్నా కూడా తమ పదవుల నుంచి రిటైర్ కారంటూ విమర్శించారు. '58 ఏండ్లు వస్తే మహారాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తారు. చాలామంది 75 ఏండ్ల వయసు రాగానే తమ వృత్తి జీవితానికి స్వస్తి పలుకుతారు. కానీ కొంతమంది (శరద్ పవార్‌ను ఉద్దేశించి) 80 ఏండ్లు దాటి 84కు వచ్చినా రిటైరవ్వడానికి సిద్ధపడటం లేదు' అని థాణేలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అజిత్ పవార్ విమర్శించారు.

వరుసగా నాలుగోసారి బంగ్లా ప్రధానిగా హసీనా!

- మూడింట రెండొంతుల సీట్లలో గెలుపొందిన అవామీ లీగ్
- నేటి ఉదయానికి పూర్తి ఫలితాల వెల్లడి
- ఎన్నికలను బహిష్కరించిన విపక్షాలు

ఢాకా, జనవరి 7: బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా వరుసగా నాలుగోసారి ఎన్నిక కానున్నారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికార అవామీ లీగ్ పార్టీ మూడింట రెండొంతుల సీట్లను కైవసం చేసుకున్నది. సోమవారం ఉదయానికి పూర్తి ఫలితాలు వెల్లడికానున్నాయి. గోపాల్‌గంజ్–3లో హసీనా ఎనిమిదో సారి విజయం సాధించారు. 1986 నుంచి ఇక్కడ నెగ్గుతూ వస్తున్న హసీనాకు 2,49,965 ఓట్లు రాగా, బంగ్లాదేశ్ సుప్రీం పార్టీకి చెందిన నిజాముద్దీన్ లష్కర్‌కు కేవలం 469 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 76 ఏండ్ల హసీనా 2009 నుంచి వరుసగా బంగ్లాదేశ్‌లో అధికారం చేపడుతూ వస్తున్నారు. దేశంలో మొత్తం 300 స్థానాలు ఉండగా, కడపటి వార్తలందేసరికి అవామీ లీగ్ 200 స్థానాల్లో నెగ్గినట్టు తెలిసింది. ఆదివారం ఆ దేశ సాధారణ ఎన్నికల్లో అతి తక్కువగా 40 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షం బీఎన్‌పీ, దాని సంకీర్ణ పార్టీలు బహిష్కరించడంతో హసీనా ఎన్నిక లాంఛనం కానుంది. చెదురుమదరు హింసాత్మక ఘటనలతో ఓటింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. అనంతరం కౌంటింగ్ ప్రారంభించారు. సోమవారం ఉదయం నాటికి పూర్తి ఫలితాలు వెల్లడి కావచ్చునని ఎన్నికల కమిషనర్ ఖాజీ హబీబుల్ ఆవల్ తెలిపారు. హసీనా ప్రధాని కానుండటం ఇది వరుసగా నాలుగోసారి కాగా, మొత్తంగా ఐదోసారి.

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేస్తున్న బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

కంటెంట్ ఉన్న సినిమాలకే ఆదరణ

ప్రశాంత్ వర్మ , చిరంజీవి , తేజ సజ్జ

'హనుమాన్' చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది . తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది . ప్రీ రిలీజ్ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన సంక్రాంతి సినిమాల విడుదలపై కీలక వ్యాఖ్యలు చేసారు . చిరంజీవి మాట్లాడుతూ 'సంక్రాంతి సినిమాలకు పరీక్షాకాలం.. హను–మాన్ చిత్రానికి థియేటర్లు దొరకడం లేదని నిర్మాతలు బాధపడ్డారు. థియేటర్ల విషయంలో నిర్మాతలు బాధపడాల్సిన అవసరం లేదు. కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు తప్పకుండా చూస్తారు. మొదటి రోజు కాకపోతే రెండో రోజు, కుదరకపోతే మూడో రోజు చూస్తారు. దిల్ రాజు సినీ పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి.. ఆయనకు ఈ సీజన్ లో ఏ సినిమాకు ఎన్ని థియేటర్లు ఇవ్వాలో తెలుసు. ఖైదీ నెం.150 సమయంలో 'శతమానంభవతి ' విడుదల చేశారు. శతమానంభవతి రిలీజ్ కొంచెం ఆలస్యం చేయవచ్చు కదా అని దిల్ రాజును అడిగాను. రెండు పెద్ద సినిమాల మధ్య మా సినిమా కూడా ప్రేక్షకులు చూస్తారని దిల్ రాజు చెప్పాడు. దిల్ రాజు చెప్పినట్లే శతమానంభవతి బాగా ఆడింది. ఇప్పుడు హను–మాన్ కూడా బాగా ఆడుతుంది. సంక్రాంతికి విడుదలయ్యే అన్ని సినిమాలు ఆడాలి, పరిశ్రమ పచ్చగా ఉండాలి' అన్నారు . రామ మందిర నిర్మాణం చారిత్రక ఘట్టమని, రామాలయ ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం అందిందని , కుటుంబ సభ్యులతో కలిసి ఆ ఉత్సవానికి హాజరు కాబోతున్నానని చిరంజీవి తెలిపారు. హనుమాన్ సినిమా టికెట్స్ పై ప్రతి ఐదు రూపాయలను రామ మందిరానికి విరాళంగా ఇస్తామని చిత్ర బృందం పేర్కొంది.

అందుకే డేటింగ్‌కు దూరం!

చిత్రం

జాన్వీకపూర్

దివంగత అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ చక్కటి ప్రణాళికతో కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నది. ఐదేళ్ల సినీ ప్రయాణంలో వివాదాలకు దూరంగా సౌమ్యురాలిగా పేరు తెచ్చుకుందీ భామ. ఎలాంటి దాపరికం లేకుండా మనసులోని భావాల్ని నిర్మొహమాటంగా వ్యక్తపరుస్తుందని ఈ అమ్మడి గురించి తెలిసివారు చెబుతుంటారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమా వాళ్లతో డేటింగ్ గురించి తన అభిప్రాయాల్ని వ్యక్తం చేసింది జాన్వీకపూర్. ఇండస్ట్రీకి చెందిన వారితో డేటింగ్ చేయడం తనకు అస్సలు ఇష్టం లేదని చెప్పింది. 'సినీరంగంలో పనిచేసేవారు ఎప్పుడూ బిజీగా ఉంటారు. ఎవరికీ సమయాన్ని కేటాయించలేరు. ఇద్దరూ ఒకే వృత్తిలో ఉంటే డేటింగ్ చేయడం ఇంకా కష్టమైపోతుంది. అందుకే సినిమా వాళ్లతో డేటింగ్ చేయాలనే ఆలోచన ఎప్పుడూ రాలేదు' అని జాన్వీకపూర్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ మహారాష్ట్ర రాజకీయ కుటుంబానికి చెందిన శిఖర్ పహారియాతో ప్రేమలో ఉందని అంటున్నారు. వీరిద్దరి కుటుంబాలకు ఎప్పటి నుంచో సాన్నిహిత్యం ఉందని, కాలేజీ రోజుల నుంచే వీరి ప్రేమాయణం సాగుతున్నదని టాక్. ఈ జంట కలిసి పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరైన ఫొటోలు సోషల్‌మీడియాలో దర్శనమిచ్చాయి. అయితే తన లవ్‌ఎఫైర్ గురించి జాన్వీకపూర్ ఇప్పటిదాకా ఎక్కడా స్పందించలేదు. ప్రస్తుతం ఈ సొగసరి తెలుగులో ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.



షారుఖ్‌ఖాన్, కరణ్‌జోహార్

షారుఖ్‌తో యాక్షన్ సినిమా

బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ కెరీర్‌లో గత ఏడాది చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. పఠాన్, జవాన్, డంకీ చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలు దక్కాయి. అందులో పఠాన్, జవాన్ చిత్రాలు వేయి కోట్ల వసూళ్ల మైలురాయిని దాటడం విశేషం. ఈ నేపథ్యంలో షారుఖ్‌ఖాన్ తదుపరి సినిమాపై అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఆయన మరో యాక్షన్ సినిమావైపే మొగ్గు చూపుతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి కరణ్‌జోహార్ దర్శకత్వం వహించబోతున్నారని తెలిసింది. తన కెరీర్‌లో ఇప్పటివరకు కరణ్‌జోహార్ యాక్షన్ సినిమా చేయలేదు. దాంతో ఈ వార్త బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్ చిత్రసీమలో షారుఖ్‌ఖాన్–కరణ్‌జోహార్‌ను సూపర్‌హిట్ కాంబినేషన్‌గా అభివర్ణిస్తారు. వారి కలయికలో కుచ్ కుచ్ హోతాహై, కభీ ఖుషీ కభీ ఘమ్, మై నేమ్ ఈజ్ ఖాన్, కభీ అల్విదా నా కెహ్నా..వంటి బ్లాక్‌బస్టర్స్ హిట్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరు కలిసి మరో సినిమాకు సిద్ధమవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయని, యాక్షన్ జోనర్‌లో సరికొత్త కథాంశాన్ని సిద్ధం చేయాలనే ఆలోచనలో కరణ్‌జోహార్ ఉన్నారని అంటున్నారు.

రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్

రాజ్‌తరుణ్, మాల్వి మల్హోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'తిరగబడరసామీ'. ఎ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకుడు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నారు. 'జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ భాగం చిత్రీకరణ జరిపాం. యువతను మెప్పించే ప్రేమకథ, ఫ్యామిలీస్‌ను ఆకట్టుకునే సెంటిమెంట్, మాస్ మెచ్చే యాక్షన్ అంశాలతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నాం. తన లక్ష్యం కోసం ఎంతటివారినైనా ఎదిరించే ఓ యువకుడి కథ ఇది. యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయి. టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఫిబ్రవరి మొదటివారంలో విడుదల చేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. మన్నారా చోప్రా, మకరంద్ దేశ్‌పాండే, రఘుబాబు, జాన్ విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి, సంగీతం: జేబీ, రచన–దర్శకత్వం: ఏఎస్ రవికుమార్ చౌదరి.

సైన్స్‌తో కూడిన వినోదం

చంద్రశేఖర్, సోనాలి

చంద్రశేఖర్, సోనాలి జంటగా నటించిన చిత్రం 'ప్లాంట్‌మాన్'. కె.సంతోష్‌బాబు దర్శకుడు. పన్నా రాయల్ నిర్మాత. సైంటిఫిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. సరికొత్త ప్రయత్నమని అందరూ ప్రశంసిస్తున్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని చిన్న సినిమాలను రూపొందిస్తూ నూతన ప్రతిభను ప్రోత్సహించాలనుకుంటున్నా' అన్నారు. వినోదం, సైన్స్ కలబోసిన ఈ చిత్రం యువతరంతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను కూడా మెప్పిస్తున్నదని దర్శకుడు తెలిపారు. కొత్త కాన్సెప్ట్‌తో తీసిన సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉందని హీరో చంద్రశేఖర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ప్రేమలోని కొత్త కోణం..

కార్తీక్‌రాజు, షెర్రీ అగర్వాల్

కార్తీక్‌రాజు, మోక్ష, షెర్రీ అగర్వాల్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ యు'. అంజి రామ్ దర్శకుడు. శ్రీగాయత్రి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగరాజ్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు మాట్లాడుతూ 'లవ్ సైకాలజీని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేమలోని కొత్త కోణాన్ని తెలియజేస్తుంది. ప్రేమకథా చిత్రాల్లో సరికొత్త పంథాలో తెరకెక్కించాం. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.మురళీమోహన్ రెడ్డి, సంగీతం: సాకార్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అంజి రామ్.

ఎల్ఐసీ నుంచి నోటీసులు

విఘ్నేష్‌శివన్

అగ్ర కథానాయిక నయనతార భర్త, తమిళ స్టార్ డైరెక్టర్ విఘ్నేష్‌శివన్ తాజా చిత్రం 'ఎల్ఐసీ' వివాదంలో చిక్కుకుంది. 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా విఘ్నేష్ శివన్ 'ఎల్ఐసీ' (లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) సినిమాను తెరకెక్కించబోతున్నారు. గత వారమే ఈ సినిమా ప్రకటన వెలువడింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ సంస్థ పేరును సినిమా టైటిల్‌గా వాడుకోవద్దంటూ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ ఎల్ఐసీ దర్శకుడు విఘ్నేష్ శివన్‌కు నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా తమ సంస్థకు ప్రజల్లో మంచి పేరుప్రఖ్యాతులు ఉన్నాయని, సినిమా కోసం ఈ టైటిల్‌ను ఉపయోగిస్తే తమ ప్రతిష్టకు భంగం కలుగుతుందని ఎల్ఐసీ సంస్థ నోటీసుల్లో పేర్కొంది. వారం రోజుల్లో టైటిల్‌ను మార్చకపోతే న్యాయపరమైన చర్యలు సిద్ధమవుతామని ఎల్ఐసీ సంస్థ హెచ్చరించింది. ప్రస్తుతం ఈ వివాదం తమిళ సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. స్వీయ నిర్మాణ సంస్థ రౌడీ పిక్చర్స్ భాగస్వామ్యంలో సెవన్ స్క్రీన్ స్టూడియోతో కలిసి విఘ్నేష్ శివన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నాడు.